క్లుప్తంగా

ఘనంగా గిడ్డాంజనేయ స్వామి జయంత్యుత్సవాలు



ప్రత్యేక అలంకరణలో గిడ్డాంజనేయస్వామి

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరి గ్రామంలో వెలసిన గిడ్డాంజనేయస్వామి జయంతి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి ఉదయం విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అంకురార్పణ తదితర కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. శుక్రవారం సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అలంకరణ అర్చన, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ నిర్వహించనున్నారు. సాయంత్రం గ్రామోత్సవంలో భాగంగా ప్రభోత్సవం కార్యక్రమాలను నిర్వహించేందుకు గ్రామస్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

గంధం చెట్టు నరికివేత

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెంచుతున్న గంధం చెట్టును దుండగులు నరికి దొంగలించారు. గురువారం ఈఓ ఆనందరావు ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పైపులైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న డీఈ మహ్మద్‌ఖాన్

సి.బెళగల్: తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మహ్మద్‌ఖాన్ తెలిపారు. గురువారం ఆయన ఏఈ గోనేనాయక్‌తో కలిసి ఆయా గ్రామాల్లోని మంచినీటి వనరులను పరిశీలించారు. తుంగభద్ర నది నుంచి సి.బెళగల్‌కు ఉన్న మంచినీటి పైపులైన్ మరమత్తు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ మంచినీరు కలుషితం కాకుండా అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన



గోరంట్ల హంద్రీలో తాగునీటి పథకాలను పరిశీలిస్తున్న ఏఈ ప్రసాద్

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల, కొత్తపల్లె గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే హంద్రీనదిలోని మంచినీటి పథకాలను గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ ప్రతి రోజు క్లోరినేషన్ చేసిన తర్వాతనే మంచినీటి పథకాల ద్వారా ప్రజలకు నీటిని సరఫరా చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. గోరంట్ల ఎస్సీ కాలనీలో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేకంగా వాల్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రతి 15రోజులకోసారి ట్యాంకును తప్పనిసరిగా శుభ్రపరచాలన్నారు. ఏఈ వెంట గోరంట్ల సర్పంచు బాలక్రిష్ణ ఉన్నారు.

బీసీజీ టీకా వేయించుకోవాలి



టీకా వేస్తున్న దృశ్యం

పాణ్యం: అరవైఏళ్లపైబడిన వ్యక్తులు తప్పనిసరిగా బీసీజీ టీకా వేయించుకోవాలని మద్దూరు పీహెచ్‌సీ డాక్టర్ అభిషేక్, ఎంపీహెచ్‌ఈఓ సబ్బారెడ్డి తెలిపారు. మండల కేంద్రం పాణ్యంలో గురువారం వారు బీసీజీ టీకా వేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ షుగర్, టీబీ తదితర వ్యాధులు సంక్రమించకుండా ముందస్తుగా వృద్ధులకు ఈ వాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మండలంలో 235మందికి ఈ వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి గురువారం తెలిపారు. తనకు వచ్చిన సమాచారం మేరకు పోలకల్ గ్రామంలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీస్ సిబ్బందితో దాడులు చేశామన్నారు. దాడులలో పేకాట ఆడుతున్న 12 మంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటంతో వారిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.4,800ల నగదును సీజ్ చేసినట్లు వెల్లడించారు.

నకిలీ విత్తు.. జాగ్రత్తతో తప్పను ముప్పు

- ఖరీఫ్‌కు సమాయత్తమవుతున్న రైతులు
- విత్తనాల కొనుగోలుపై అవగాహన తప్పనిసరి
- జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యవసాయాధికారులు



గడివేములలో విత్తన దుకాణాన్ని, తనిఖీ చేస్తున్న హేమ సుందర్‌రెడ్డి

గడివేముల: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఖరీఫ్ కోసం పొలాలకు ఎరువులు తోలడం, దుక్కులు దున్నడం ప్రారంభించారు. వాతావరణం పూర్తిస్థాయిలో అనుకూలిస్తే నెల రోజుల్లో రైతులు విత్తనాలు జల్లే పనులు చేపట్టనున్నారు. గడివేముల మండలంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రధానంగా వరి, పత్తి ,మిరప పంటలు ఎక్కువగా సాగు చేస్తుంటారు. వర్షాలు సమృద్ధిగా కురిసే అవకాశం ఉండటంతో విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. కాగా కొందరు వ్యాపారులు తక్కువ ధరలో ఎక్కువ దిగుబడి ఇచ్చే విత్తనాలు తమ వద్ద లభిస్తాయంటూ రైతులను మభ్యపెడుతున్నారు. దీంతో రైతులు ఆకర్షితులై దూకాణాల్లో విత్తనాలు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. నకిలీ విత్తనాల బారిన పడి ఏటా అధిక సంఖ్యలో రైతులు నష్టపోతున్న నేపథ్యంలో కొనుగోలు సమయంలో తగిన సూచనలు పాటించాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే నకిలీ విత్తనాలను ముందే గుర్తించవచ్చు. నష్టపోయినా పరిహారం సైతం పొందచ్చని పేర్కొంటున్నారు.

రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలు..

- వ్యవసాయ శాఖ అనుమతి పొందిన దుకాణాల్లో మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్ని చోట్ల ప్రభుత్వం అనుమతి లేని అనధికార విత్తన వ్యాపారులు తెల్లసంచుల్లో నకిలీ విత్తనాలను విక్రయించే అవకాశం ఉన్నంది. వారి పట్ల అప్రమత్తంగా ఉంటూ.. వారి సమాచారాన్ని తక్షణమే అధికారులకు తెలియజేయాలి.
- ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల నుంచే సర్టిఫైడ్ విత్తనాలు కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. బిల్లుపై రైతు చిరునామా, గడువు తేదీ, విత్తనం ధర, కంపెనీ పేరు, అమ్మినవారి సంతకం తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- విత్తన బస్తాపై ముద్రించిన ధ్రువపత్ర బిల్లు తమ పంట చేతికి వచ్చేవరకూ రైతులు భద్రపరచుకోవాలి. విత్తనాలు కొన్న వెంటనే మొలక శాతం పరీక్షించుకోవాలి. కనీసం 75 శాతం మొలకలు ఉంటేనే వాటిని విత్తనంగా వినియోగించుకోవాలి. విత్తన సంచులను రైతులు నమూనా వివరాల కోసం పంట కోతకు వచ్చే వరకూ దాచుకోవాలి.

రైతులు జాగ్రత్తలు పాటించాలి..

ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వ్యాపారుల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలి. ఒక వేళ నకిలీ విత్తనాలతో మోస పోతే వెంటనే వ్యవసాయాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చు. విత్తనాలు నాణ్యమైనవి కాక పోవడం వల్లే దిగుబడి రాలేదని గుర్తిస్తే సదరు విత్తన కంపెనీపై మండల వ్యవసాయాధికారి ద్వారా జిల్లా వ్యవసాయ సంచాలకులకు ఫిర్యాదు చేసి పరిహారం పొందేందుకు వీలుంటుంది. దీనికోసం రైతులు తమ విత్తన కొనుగోలు బిల్లు భద్రపరచుకోవాల్సి ఉంటుంది.

– హేమ సుందర్ రెడ్డి, ఏఓ, గడివేముల

తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సునీత

గూడూరు: వర్షాకాలం నేపథ్యంలో తాగు నీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సునీత సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ కుమారి జయశ్రీ ఆధ్వర్యంలో మండల మీట్ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వర్షాలు ముందుగానే కురుస్తున్నాయని, తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పైప్‌లైన్ లీకేజీలు ఎప్పటికప్పుడు సరి చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలను చైతన్య పరచడంలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని హెల్త్ సూపర్‌వైజర్ రాఘవయ్య కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సనా చౌదరి మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, వాటిని శుభ్రం చేయించాలని సూచించారు. సబ్సిడీ వేరుశనగ, కొర్రలు, కందుల విత్తనాలు ఆర్‌బీకే సెంటర్‌లో అందుబాటులో ఉన్నాయని ఏఈఓ లక్ష్మినారాయణ తెలిపారు. గ్రామాలలో ఉపాధి పనులు అడిగిన వారందకీ కల్పిస్తున్నామని ఈజీఎస్ ఏపీఓ రామేశ్వరమ్మ చెప్పారు. సమావేశంలో పీఆర్ ఏఈ గోపాల్ రావ్, ఈఓఆర్డీ మధులత, పచాయితీ కార్యదర్శులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



చికిత్స పొందుతున్న డేవిడ్

చాగలమర్రి: మండలంలోని నగ్గళపాడు గ్రామ సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోడుమూరుకు చెందిన డేవిడ్ అనే యువకుడికి గాయలయ్యాయి. వివరాలు.. కోడుమూరు పట్టణానికి చెందిన డేవిత్ సొంత పనుల నిమిత్తం తన పల్సర్ మోటార్ సైకిల్‌పై కడపకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో నగ్గళపాడు సమీపంలో డివైడర్‌పై నుంచి అకస్మాత్తుగా వచ్చిన కుక్క బైక్‌ను ఢీ కొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన డేవిడ్‌ను గ్రామస్తులు 108 వాహనంలో చాగలమర్రిలోని కేరళ ఆసుపత్రికి తీసుకెళ్లారు.అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడికి ప్రథమ చికిత్స అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



పోలకల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

సి.బెళగల్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కోడుమూరు సీఐ మనుసూరుద్దీన్ హెచ్చరించారు. మండల పరిధిలోని పోలకల్ పోలీసులు కార్డెన్‌సెర్చ్‌ను నిర్వహించారు. పాత నేరస్తులు, రౌడీ షీటర్లు, అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐ గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి మాట్లాడారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా సాగేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కౌంటింగ్ నేపథ్యంలో పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని, ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. విజయోత్సవ సంబరాలు నిషేధమన్నారు. కార్యక్రమంలో పోలకల్, గూడూరు, కోడుమూరు ఎస్ఐలు ఎస్ఐ తిమ్మారెడ్డి, అనుమంతయ్య, బాలనరసింహుడు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలి



వంటలో ప్రతిభ చూపించిన నిర్వాహకురాలికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

గడివేముల: పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని ఎంఈఓ విమలా వసుంధర దేవి తెలిపారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో గురువారం మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మాస్టర్ ట్రైనర్ ఆషారాణి, ఎంపీహెచ్ఓ మహేశ్వర్ రెడ్డి భోజనం తయారీ, కూరగాయలు, ఆకుకూరల వినియోగం, వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ప్రయోజనాలను వివరించారు. అనంతరం నిర్వాహకులకు వంట పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం రుచిగా తయారు చేస్తే విద్యార్థులు వంద శాతం ఇక్కడే భోజనం చేస్తారన్నారు. విద్యార్థులకు రుచికరమైన,నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు.

ప్రశాంతంగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ

కర్నూలు సిటీ: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో గురువారం జరిగిన కర్నూలు రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రశాంతంగా జరిగింది. సమావేశంలో ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, ఎంపీడీఓ నరసింహా నాయుడు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ఆయా శాఖలకు చెందిన పురోభివృద్ధిపై చర్చించారు. ఖరీఫ్ సీజన్‌లో చేపట్టే వ్యవసాయ పనులు, సాగు చేసే పంటల విస్తీర్ణం, విత్తనాల పంపిణీపై వ్యవసాయ శాఖ అధికారి వివరించారు. వర్షాకాలం సీజన్ రానుండడంతో పంచాయతీల్లో అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఎంపీపీ, ఎంపీడీఓ సూచనలు చేశారు. గ్రామాల్లో పరిశుభ్రమైన తాగు నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాని, క్లోరినేషన్ చేసిన తరువాతే కుళాయిలకు నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. 14 శాఖలకు చెందిన అంశాలను సమావేశంలో ఆయా శాఖల అధికారులు వివరించారు.

పది పరీక్షకు 88 మంది గైర్హాజరు

సి.బెళగల్: మండల కేంద్రంలోని రెండు పరీక్ష కేంద్రాలలో జరుగుతున్న పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షకు 88 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పరీక్ష నిర్వాహకులు తెలిపారు. గురువారం జరిగిన జనరల్ సైన్స్ పరీక్షకు సి.బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 215 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 173 మంది హాజరుకాగా 42 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం డిపార్టుమెంటల్ అధికారి అనంతయ్య తెలిపారు. అదేవిధంగా మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో 211 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 165 మంది హాజరై 46 మంది గైర్హాజరయ్యారని ఆ పాఠశాల పరీక్షల చీఫ్ ధనుంజయగౌడ్ తెలిపారు.

ధూమపానానికి దూరంగా ఉండాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న హేమలత

కోడుమూరు రూరల్ : ప్రజలు ధూమపానానికి, పొగాకు ఉత్పత్తుల వినియోగానికి దూరంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమ అధికారిణి హేమలత సూచించారు. గురువారం మండలంలోని వర్కూరు గ్రామంలో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని హేమలత పరిశీలించి వైద్య సేవల తీరుపై ఆరా తీశారు. వైద్యసిబ్బందితో కలిసి పొగాకు ఉత్పత్తుల మూలంగా కలిగే అనర్థాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరదాగా మొదలయ్యే బీడీ, సిగరెట్ అలవాటు తర్వాత వ్యసనంగా మారుతుందని, ప్రాణాలకే ముప్పువాటిల్లుతుందని హెచ్చరించారు. పొగ తాగడం వలన క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్, దగ్గు, రక్తపోటు తదితర రోగాలకు గురవుతారన్నారు. అలాగే గుట్కా, ఖైనీ తదితర పొగాకు ఉత్పత్తులకు యువత దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కోడుమూరు కోలోకెటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డా.శ్రీమంత్‌మాదన్న, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఉరుకుందమ్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడల్లో సాధన చేయాలి

కర్నూలు (టౌన్): వేసవి సెలవులను వృథా చేయకుండా ఇష్టమైన క్రీడల్లో సాధన చేయాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు అన్నారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో చౌక్ బాల్ క్రీడలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. క్రీడల్లో మెలకువలు వివరించారు. పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు కొంత సమయాన్ని క్రీడలకు కేటాయిస్తే జాతీయ స్థాయిలో రాణించవచ్చన్నారు. క్రీడల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు విద్యా, ఉద్యోగాల్లో అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో చౌక్‌బాల్ సంఘం కార్యదర్శి వేణుగోపాల్, శిక్షకులు శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.



కమాండ్ కంట్రోల్ రూం నుంచి సీసీ కెమెరాలతో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

పాణ్యం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆర్జీఎం, శాంతిరామ్, ఫార్మసీ కాళాశాలో నంద్యాల పార్లమెంట్, అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌లలోని ఈవీఎంలను సీసీఈ కెమెరాల ద్వారా కమాండ్ కంట్రోల్ నుంచి జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 04వ తేదీన నిర్వహించే సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. కేంద్రాల్లో ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డిని ఆదేశించారు. సీసీ కెమరాల నిఘా, భద్రత నిఘా నిరంతరం ఉండాలన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల చూట్టు పరిసర ప్రాంతాల్లో 144సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అనంతరం స్ట్రాంగ్‌రూమ్‌లు, భద్రత, పార్కింగ్, కౌంటింగ్ టెబుళ్ల ఏర్పాటు తదితర విషయాలపై ఆరా తీశారు.

నకిలీ విత్తనాలపై అప్రమత్తంగా ఉండాలి



పత్తి విత్తన పరీక్ష ఫలితాలను రైతులకు వివరిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ అనుమతులున్న నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాల్లో తనిఖీలు చేశారు. అదేవిధంగా బీటీ పత్తి విత్తనాలలో హెర్బీసైడ్ టోలరెంట్ (హెచ్‌టీ – కలుపు సంహారకాలను తట్టుకునేది) పరీక్షలను నిర్వహించారు. స్థానిక కోరమండల్, విశ్వజిత్ ట్రేడర్స్, శివసాయి, నాగసాయి, కిసాన్‌మాల్లలోని బీటి పత్తి విత్తనాలకు హెచ్‌టీ పరీక్షలను నిర్వహించగా, అన్ని పరీక్షల ఫలితాలలో నెగెటీవ్ రిపోర్టు వచ్చినట్లు ఏఓ తెలిపారు. పత్తి విత్తన పరీక్ష ఫలితాలను, నాణ్యతను స్థానికంగా ఉన్న రైతులకు ఏఓ వివరించి, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. అదేవిధంగా విత్తన నమూనాలను గుంటూరు ల్యాబ్‌కు పంపుతున్నట్లు ఆయన తెలియజేశారు. కాగా మండలానికి 160 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు మంజూరు అయ్యాయని, విత్తనాలు అవసరమైన రైతులు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేలలో సంప్రదించి వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ తిమ్మారెడ్డి

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో గురువారం కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపారు. గ్రామంలో కొంతమంది అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో కంబదహాల్ గ్రామంలో సోదాలు నిర్వహించగా.. కర్ణాటక మద్యంతో స్కూటర్‌పై వస్తుస్తున్న గ్రామానికి చెందిన బోగమొల్ల కృష్ణ అనే వ్యక్తిని పట్టుకున్నామన్నారు. కాగా నిందితుడి నుంచి 37 కర్ణాటకకు చెందిన 90 ఎంఎల్ ఆఫీసర్స్ చాయిస్ టెట్రాప్యాకెట్లు లభించడంతో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు. అదేవిధంగా మద్యంను, స్కూటర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



మాట్లాడుతున్న సీఐటీయూ డివిజన్ కార్యదర్శి మోహన్

గూడూరు: పోరాడి హక్కులు సాధించుకోవాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జే.మోహన్ అన్నారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సీఐటీయూ మండల అధ్యక్షుడు గుంటప్ప అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మోహన్ మాట్లాడుతూ 1970 మే లో కోల్‌కతాలో సీఐటీయూ ఆవిర్భవించందని, అప్పటి నుంచి నేటి వరకు పేదల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తోందన్నారు. అనంతరం సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. నాయకులు సుజాత, సోమలింగడు, శాంతన్న, హమాలి కార్మికులు,మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



గొర్రెకు ఈటీ టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

కల్లూరు: గొర్రెలు, మేకలు తదితర మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని చిన్నటేకూరు పశువైద్యుడు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం చిన్నటేకూరు పశువైద్యశాల పరిధిలోని గ్రామాల్లో చిటుకు వ్యాధి రాకుండా ఈటీ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జీవాలకు ఉచితంగా ఈ టీకాను వేస్తున్నామని,పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 4-6 మాసల వయసు జీవాలన్నింటికీ సీజనల్ వ్యాధులు సోకకుండా నివారణ టీకాలు వేయించాలన్నారు.

విజయోత్సవ సంబరాలు నిషేధం



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

కల్లూరు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న తేదీన జరుగుతున్న నేపథ్యంలో 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని సీఐ కిరణ్ కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు నిషేధమని, ప్రతి ఒక్కరూ ఈ నిబంధన పాటించాలన్నారు. నలుగురి కన్నా ఎక్కువ మంది గుమి కూడి ఉంటే అరెస్టు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల ఫలితాలను సానుకూలంగా స్వీకరించాలని, గెలిచామని విజయోత్సవ సంబరాలు, సమావేశాలు, ర్యాలీలు నిషేధమన్నారు. అలాగే ఓడి పోయామన్న బాధలో కూడా ఎటువంటి చర్యలకు ఉపక్రమించినా వారిపై పోలీసు యాక్ట్ ఉపయోగించడంతో పాటు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.